సాక్షి నిర్మల్

శుక్రవారం | 18 | ఆగస్టు | 2023



బాసర వరకు తిరుపతి రైలు..!

ప్రస్తుతం తిరుపతి నుంచి కరీంనగర్ వరకు నడుస్తున్న రైలును బాసర వరకు పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు రైల్వేబోర్డుకు ప్రతిపాదించారు. 8లో▸



'కదిలి'కి శ్రావణ శోభ

ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణేశ్వరి కదిలి పాపహరేశ్వరాలయంలో గురువారం నుంచి శ్రావణమాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.3/23.1

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో చాలాచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపు అండర్ 14, 17 క్యారమ్స్, చెస్ సెలక్షన్స్

నిర్మల్ రూరల్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అండర్ 14, 17 బాల బాలికలకు శనివారం క్యారమ్స్, చెస్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. సారంగాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సెలక్షన్‌లో పాల్గొనే బాలబాలికలు తమ వివరాల నమోదుకు 19న ఉదయం 9 గంటలలోపు సారంగాపూర్ ఉన్నత పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీపూర్ లిఫ్ట్‌కు అటవీ అనుమతులు ఇవ్వండి



పీసీసీఎఫ్ కార్యాలయంలో రేఖానాయక్

కడెం: మండలంలోని లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్‌కు అటవీ అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ కోరారు. ఈ మేరకు పీసీసీఎఫ్ డోబ్రియల్‌ను హైదరాబాద్‌లో గురువారం కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం లిఫ్ట్‌కు నిధులు చేసిందని, అటవీ అనుమతులు రాకపోవడంతో పనులు ప్రారంభించడం లేదని తెలిపారు. ఈ లిఫ్ట్ పూర్తయితే కడెం మండలంలోని నవాబ్‌పేట్, లక్ష్మీపూర్, దోస్తనగర్, కల్లెడ, దస్తురాబాద్ మండలంలోని అకొండపేట్ గ్రామాలకు సాగు నీరందుతుందని వివరించారు.

తెప్పపై నది దాటి.. పనుల పరిశీలన



తెప్ప పై ప్రయాణిస్తున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్

కడెం: మండలంలోని ఉమ్మడి గంగాపూర్ జీపీకి విద్యుత్ సరాఫరా అందించేందుకు కడెం ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌కు ఇరువైపులా రెండు టవర్లను నిర్మిస్తున్నారు. ఇటీవలే పనులు ప్రారంభం కావడంతో పనుల పురోగతిని తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్.చౌహాన్ గురువారం తెప్పపై కడెం నదిని దాటి పనులు పరిశీలించారు. ఆయన వెంట డీఈ నాగరాజు, ఏడీఏ కేశెట్టి శ్రీనివాస్, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

నేడు అథ్లెటిక్ ఎంపిక పోటీలు

నిర్మల్ రూరల్: తెలంగాణ అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మనాభంగౌడ్, సామ్యూల్ తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగంలో రెండో మిడిల్, లాంగ్ డిస్టెన్స్ పరుగు పందెం పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. బాల బాలికలు, మహిళలు, పురుషులకు వేర్వేరుగా పరుగు పందెం ఉంటుందని తెలిపారు. ఇందులో గెలుపొందిన వారు ఈనెల 20న హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9440516634 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

బోదకాలు నియంత్రణకు కృషి చేద్దాం



సర్వేను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకురాలు

దస్తురాబాద్: బోదకాలు వ్యాధి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆరోగ్యశాఖ రాష్ట్ర పరిశీలకురాలు డాక్టర్ ప్రిన్సి సూచించారు. మండలంలోని రేవోజీపేట, మున్యాల, బుట్టాపూర్, దస్తురాబాద్, భూత్కూర్ గ్రామాల్లో బోదకాలు నియంత్రణకు చేపట్టిన వివరాలను, బోదకాలు నివారణ మాత్రల పంపిణీని గురువారం పరిశీలించారు. బోదకాలు బాధితుల వివరాలను సేకరించారు.ఆ రోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గ్రామాల్లో ఎప్పటికప్పుడు వివరాలను అందించాలన్నారు. ఆమె వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కామేశ్వర్, ఆరోగ్యవిస్తరణ అధికారి వేణుగోపాల్, ఆశ కార్యకర్తలు గోదావరి, సూజాత, లక్ష్మి, రాజమణి ఆరోగ్యసిబ్బంది ఉన్నారు.



'ఏలేటి' ఆమరణదీక్షకు సంఘీభావం తెలిపిన ఈటల రాజేందర్

పొలిటికల్ ప్లాన్

- ముదురుతున్న 'ముసాయిదా'లొల్లి
- పూర్తిగా రద్దుకు బీజేపీ పట్టు
- ఆమరణదీక్ష కొనసాగిస్తున్న 'ఏలేటి'
- నేడు నిర్మల్‌బంద్‌కు పిలుపు
- ఎన్నికల స్టంట్ అంటున్న బీఆర్ఎస్

నిర్మల్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదాపై లొల్లి ముదురుతోంది. పూర్తిగా రద్దు చేయాలని బీజేపీ పట్టుపడుతోంది. ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆమరణ దీక్షకు దిగారు. పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ గురువారం నిర్మల్‌కు వచ్చి ఏలేటికి సంఘీభావం తెలిపారు. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు శుక్రవారం నిర్మల్ రానున్నట్లు పార్టీ ప్రకటించింది. మాస్టర్‌ప్లాన్ రద్దు అంశంపై శుక్రవారం నిర్మల్ బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. ఇదిలా ఉంటే.. అధికార బీఆర్ఎస్ కౌంటర్ ఇవ్వడం మొదలుపెట్టింది. ప్రస్తుతం ఉన్నది మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్టు మాత్రమేనని, అభ్యంతరాల స్వీకరణ, మార్పులు, చేర్పులు ఉంటాయని పేర్కొంటుంది. బీజేపీ చేస్తున్నదంతా ఎన్నికల స్టంట్ అని ఆరోపిస్తోంది.

నేతల రాకతో..

మాస్టర్‌ప్లాన్‌పై పోరును సీరియస్‌గా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతో బీజేపీ అగ్రనాయకులను నిర్మల్ రప్పిస్తోంది. ప్రస్తుత తరుణంలో ఏలేటి చేపట్టిన ఆమరణదీక్ష ఎఫెక్ట్ రాష్ట్ర వ్యాప్తంగా తెలియాలన్న లక్ష్యంతో సీనియర్‌నేతలూ జిల్లాకు వస్తున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే గురువారం ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ రాగా, శుక్రవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు వస్తున్నట్లు చెబుతున్నారు. ఈటల స్థానిక మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎం కేసీఆర్‌పై విరుచుకు పడ్డారు.

ఎన్నికల స్టంట్ అంటూ..

మాస్టర్‌ప్లాన్‌పై ప్రస్తుతం ఇచ్చింది డ్రాఫ్ట్ మాత్రమేనని, దీనిపై అభ్యంతరాల స్వీకరణ తర్వాత మార్పులు ఉంటాయని అధికార బీఆర్ఎస్ చెబుతోంది. ఎన్నికల స్టంట్‌లో భాగంగానే బీజేపీ రాద్ధాంతం చేస్తోందని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ ఆరోపించారు.

మధ్యలో రైతులు..

మాస్టర్‌ప్లాన్ అసలు బాధితులైన రైతులు ఇప్పటికీ ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. ఏడునెలల క్రితం ప్రతిపక్షాల పోరు, తమ అభ్యంతరాల మేరకు మాస్టర్‌ప్లాన్ డ్రాఫ్టును మొత్తానికే రద్దుచేస్తున్నట్లు ప్రకటించడంతో హర్షం వ్యక్తంచేశారు. తాజాగా బీజేపీ ఇదే అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి పోరాటం చేస్తుంది. మాస్టర్‌ప్లాన్ పూర్తిగా రద్దు చేయాలని పార్టీలకతీతంగా రైతులను, బాధితులను ఏకతాటిపైకి తెచ్చే ప్రయత్నం చేస్తోంది.

ప్లాన్‌లో మార్పులు చేస్తాం

- మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ రూరల్: నిర్మల్ మున్సిపల్ మాస్టర్ ప్లాన్‌లో మార్పులు చేస్తామని, ఇది కేవలం డ్రాఫ్ట్ మాత్రమేనని.. దీనిపై బీజేపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం మాట్లాడారు. 1990లో నిర్మల్ మాస్టర్ ప్లాన్ తయారు చేశారని, 33 ఏళ్ల తర్వాత అన్ని వర్గాల ప్రయోజనం కోసం మాస్టర్ ప్లాన్ తీసుకొస్తున్నామన్నారు. మధ్యలో 2009లో మాస్టర్ ప్లాన్ తీసుకురావాల్సి ఉండగా, అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న మహేశ్వర్‌రెడ్డి కళ్లు మూసుకున్నారా అని ప్రశ్నించారు. మాస్టర్ ప్లాన్ ప్రక్రియ పూర్తయిందని ఆధారాలతో నిరూపిస్తే.. తాను మున్సిపల్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. నిరూపించకపోతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ నుంచి విరమించుకోవాలన్నారు. గతంలో స్పిన్నింగ్ మిల్ ఉన్న కారణంగా నటరాజ్‌నగర్, వెంకటాపూర్, సోఫీ నగర్, మంజులాపూర్ కాలనీలు ఇండస్ట్రియల్ ఏరియాగా మాస్టర్ ప్లాన్‌లో వచ్చాయన్నారు. ప్రజలకు, రైతులకు నష్టం కలగకుండా కమర్షియల్ జోన్‌ను రెసిడెన్షియల్ జోన్‌గా మారుస్తామన్నారు. మున్సిపల్ లైసెన్స్ సర్వేయర్లు ,అవగాహన ఉన్న ఇంజనీర్లతో కలిసి రాబోయే తరానికి, పట్టణ అభివద్ధి కోసం మాస్టర్ ప్లాన్ కేవలం ప్రతిపాదనలు(డ్రాఫ్ట్)మాత్రమే తయారు చేశామన్నారు. ఇందులో తప్పకుండా మార్పులు ఉంటాయన్నారు. మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఇన్ని రోజులు మాస్టర్ ప్లాన్‌పై మాట్లాడకుండా ఇప్పుడు మాట్లాడడం కేవలం ఎన్నికల స్టంట్ అని అన్నారు. చీటికిమాటికి మంత్రి అల్లోల ప్రజలను మోసం చేశారని, అవినీతికి పాల్పడ్డారని విమర్శించడం సరికాదన్నారు. ప్రజలంతా తమ పార్టీ వైపే ఉన్నారని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మరోసారి భారీ మెజారిటీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కౌన్సిలర్లు లక్కాకుల నరహరి, గండ్రత్ రమణ, బిట్లింగు నవీన్, అబ్దుల్ మతీన్ తదితరులు ఉన్నారు.

ఆందోళన అవసరం లేదు

నిర్మల్ రూరల్: నిర్మల్ మాస్టర్‌ప్లాన్ ముసాయిదా మాత్రమే ప్రచురించినట్లు మున్సిపల్ కమిషనర్ సీవీఎన్.రాజు తెలిపారు. దీనిపై ప్రజల నుంచి సవరణలు, ఆక్షేపణలు, దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. విచారణ చేసిన అనంతరం వాటిని పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ విషయంలో పట్టణ ప్రజలు ఆందోళన చెందొద్దని కోరారు.

ఆలయాల అభివృద్ధికి మరిన్ని నిధులు

- రూ.6కోట్లతో పాపహరేశ్వరాలయ పునర్నిర్మాణం
- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



చైర్మన్‌ను అభినందిస్తున్న మంత్రి ఐకేరెడ్డి

దిలావర్‌పూర్: జిల్లాలోని ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణాలకు మరిన్ని నిధులు సమకూర్చనున్నట్లు దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కదిలి అటవీప్రాంతంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయ ప్రాంగణంలో నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోని ఆలయాలన్నీ ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. జిల్లాలోని అనేక నూతన ఆలయాల నిర్మాణాలు, పురాతన ఆలయాల పునర్నిర్మాణాలకు భారీగా నిధులు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాలో అడెల్లి మహాపోచమ్మ ఆలయ పునర్నిర్మాణం ఇటీవల చేపట్టామన్నారు. కదిలి శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయాన్ని కూడా రూ.6 కోట్లతో కృష్ణ శిలలతో పునర్నిర్మిస్తామని పేర్కొన్నారు.

రూ.300 కోట్లతో బాసర ఆలయ పునర్నిర్మాణం..

జిల్లాలో ప్రసిద్ధి బాసర శ్రీజ్ఞాన సరస్వతీదేవి ఆలయ పునర్నిర్మాణం, అభివృద్ధికి రూ.300 కోట్లు వెచ్చిస్తామని మంత్రి తెలిపారు. సీఎం కేసీఆర్ త్వరలోనే బాసర పర్యటనకు వస్తారన్నారు. కాల్వ ఆలయ ప్రాంగణంలో రూ.2 కోట్ల వ్యయంతో కళ్యాణ మంటపం నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కదిలి శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయ నూతన పాలకమండలితో ప్రమాణం చేయించారు. మంత్రి సమక్షంలో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ రంగు రవికిషన్ గౌడ్ ధర్మకర్తలతో ప్రమాణ స్వీకారం చేయించారు. నార్వాడి వెంకట్రావుపాటిల్ చైర్మన్‌గా, సింధె అనురాధ, పులిండ్ల లింగన్న, ఆలూర్ రమేశ్, సొలాయి గారి చంద్రశేఖర్‌రెడ్డి, తోట రమాకాంత్, నల్ల పురుషోత్తమ్‌రెడ్డి ధర్మకర్తలుగా, ఆలయ ప్రధాన అర్చకుడు పంచాక్షరి ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ప్రమాణం చేశారు. కార్యక్రమంలో జెడ్పీచైర్‌పర్సన్ విజయలక్ష్మి, కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ సుభాష్‌రావు, సర్పంచ్ సుకరి సరిత, ఎంపీపీ పాల్దె అక్షర, పీఏసీఎస్ చైర్మన్ రమణారెడ్డి, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నిర్మల్ బంద్

నిర్మల్‌రూరల్: మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని శుక్రవారం నిర్మల్ బంద్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. మాస్టర్‌ప్లాన్ రద్దు చేయాలని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రెండు రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. బంద్‌కు ప్రజలు మద్దతు ఇవ్వాలని గురువారం సాయంత్రం పట్టణంలో ఆ పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం బంద్‌కు సహకరించాలని కోరారు.

'మద్యం' దరఖాస్తులకు చివరి రోజు

నిర్మల్:మద్యం దుకాణాలకు టెండర్లకు ప్రభుత్వం దరఖాస్తులు స్వీకరిస్తుంది. శుక్రవారంతో దరఖాస్తు గడువు ముగియనుంది. గురువారం వరకు జిల్లాలోని 47 వైన్సులకు 318 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నిర్మల్ సర్కిల్‌లో మొత్తం 29 మద్యం దుకాణాలు ఉండగా, వీటికి ఏకంగా 250 దరఖాస్తులు వచ్చాయి. భైంసా సర్కిల్ పరిధిలో 18 వైన్సులు ఉండగా వీటికి 68 మాత్రమే వచ్చాయి. గతంలో 556 దరఖాస్తులు రాగా, ఈసారి దరఖాస్తులు బాగా తగ్గాయి. చివరిరోజైన శుక్రవారం భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

పోషకాహారంతో రక్తహీనత దూరం

- డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ ధనరాజ్

సారంగాపూర్: పోషకాహారంతో రక్తహీనతను నివారించవచ్చని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ధనరాజ్ అన్నారు. గర్భిణులు రక్తహీనతకు రాకుండా పోషకాహారం తీసుకోవాలని సూచించారు. సారంగాపూర్ రైతువేదికలో గర్భిణులు, కిశోరబాలికల్లో రక్తహీనత నివారణ చర్యలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతీ ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలతోపాటు మహిళా ఆరోగ్య కార్యకర్తలు గర్భిణులను గుర్తించి వారికి సరైన పోషకాహారం తీసుకునేలా సూచనలు చేయాలన్నారు. ఐరన్ ఎక్కువగా ఉండే ఆహారం తీసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రాజేందర్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వేదవ్యాస్, మోహిన్‌అలీ, డాక్టర్ శ్రీనివాస్, నిఖిలరాణి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, సరస్వతి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు బీమా



లక్ష్మణచాందలో చెత్తను సేకరిస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

- అంత్యక్రియలకు రూ.10 వేల సాయం
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- జిల్లాలో 1,695 మంది కార్మికులకు లబ్ధి

లక్ష్మణచాంద:గ్రామాలను పరిశుభ్రంగా, స్వచ్ఛంగా ఉంచడంలో గ్రామ పంచాయతీ కార్మికుల పాత్ర కీలకం. ఉదయం లేచింది మొదలు గ్రామాల్లోని రోడ్లపై ఉన్న చెత్తను తొలగించడంతోపాటు మురికి కాల్వలను శుభ్రం చేయడం, హరితహారంలో నాటిన మొక్కలను రక్షించడం, తాగునీటి సరఫరాలో వీరిపాత్ర ఎంతో ముఖ్యమైనది. ఇప్పటి వరకు వీరికి ఎలాంటి బీమా సౌకర్యం లేదు. దీంతో కార్మికులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబం రోడ్డున పడాల్సిందే. పంచాయతీ కార్మికుల శ్రమను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారికి తీపి కబురు చెప్పింది. గ్రామ పంచాయతీలలో పనిచేసే మల్టీపర్పస్ వర్కర్లకు బీమా సౌకర్యం కల్పించాలని నిర్ణయించింది. దీంతో జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న 1,695 మంది మల్టీపర్పస్ వర్కర్లకు లబ్ధి చేకూరనుంది.

ఎల్ఐసీ ద్వారా బీమా అమలు...

జిల్లాలోని 396 గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ వర్కర్లుగా పనిచేస్తున్న 1,695 వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా(ఎల్ఐసీ) బీమా అమలు చేయాలని సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీమా ప్రీమియంకు అవసరయ్యే నిధులను గ్రామ పంచాయతీలు చెల్లించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రీమియం చెల్లింపులతోపాటు క్లెయిమ్‌ల పర్యవేక్షణను డీపీవోలు అప్పగించింది. ఈ బీమాతో కార్మికుడు మరణిస్తే అతడి కుటుంబానికి రూ.5 లక్షల సాయం అందుతుంది.

పెరిగిన తక్షణ సహాయం.....

పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులు సర్వీస్‌లో ఉన్న సమయంలో మరణిస్తే గతంలో అత్యవసర ఖర్చుల నిమిత్తం(అంత్యక్రియల)కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ.5 వేలు అందించేది. ఆ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.10 వేలకు పెంచింది.

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు..



గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు ఎల్ఐసీ ద్వారా బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పంచాయతీల నుంచి కార్మికుల పేరిట ప్రీమియం చెల్లిస్తాం.
– శ్రీలత, డీపీవో

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గంగాధరయ్య



ఆవుకు టీకావేస్తున్న డాక్టర్ గంగాధరయ్య

దిలావర్‌పూర్:పశువుల పెంపకందారులు సీజనల్‌గా పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ గంగాధరయ్య సూచించారు. మండలంలో సిర్గాపూర్ గ్రామంలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని గురువారం పరిశీలించారు. రైతులు, పాడి పరిశ్రమ ఉన్నవారు తమ పశుసంపదపై శ్రద్ధ వహిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. ముఖ్యంగా పశువుల్లో ఎలాంటి వ్యాధి లక్షణాలు కనిపించినా పశువైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా పాడిపరిశ్రమే ఆధారంగా ఉన్నవారు పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగే ప్రత్యేక వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గంగారెడ్డి మండల పశువైద్యాధికారి డాక్టర్ నందకుమార్, జేవీవోలు మంజుల, ప్రభాకర్, రాజేశ్వర్, రైతులు పాల్గొన్నారు.

పాఠశాల, వసతిగృహాన్ని తనిఖీ చేసిన కలెక్టర్



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న కలెక్టర్

సోన్: మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఇటీవల డెంగీ, టైఫాయిడ్, మలేరియా ప్రబలాయి. అధికారులు స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మెడికల్ క్యాంపు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, అంటు వ్యాధుల నివారణపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కలెక్టర్ వరుణ్‌రెడ్డి గాంధీనగర్ గ్రామాన్ని సందర్శించారు. లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాల, కళాశాల వసతి గృహాన్ని గురువారం తనిఖీ చేశారు. గాధీనగర్ గ్రామంలో రోగులకు అందుతున్న చికిత్స గురించి తెలుసుకున్నారు. అనంతరం బాలికల వసతిగృహాన్ని పరిశీలించి 10వ తరగతి విద్యార్థులకు గణితం బోధించారు. గణితంలో రాణించేందుకు చిట్కాలు తెలిపారు. విద్యార్థులు ఆటలు, వ్యాసరచన తదితర విషయాలపై పట్టు ఉండాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించి, అక్కడ అందుతున్న మెనూ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వంటశాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. కలెక్టర వెంట జెడ్పీ సీఈవో సుధీర్ కుమార్, జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్ రెడ్డి, తహసీల్దార్ శివరాజ్, ప్రిన్సిపాల్ సరస్వతి, ఎంపీవో, ఏపీఎం, ఆర్ఐ, కార్యదర్శి తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

- అందుకు ఉపాధ్యాయులు నిబద్ధతతో పని చేయాలి
- కలెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి
- మన ఊరు – మన బడి, అకడమిక్ క్యాలెండర్‌పై సమీక్ష



పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్, డీఈఓ

నిర్మల్ రూరల్: విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాలలో అభివృద్ధి సాధించేలా కృషి చేయాలని, ఇందుకు ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్ అధికారులు, ఎంఈవోలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం నిర్వహించారు. మన ఊరు – మన బడి పనుల ప్రగతి, అకడమిక్ క్యాలెండర్, విద్యా కార్యక్రమాల అమలుపై సమీక్ష చేశారు. టీచర్స్ ఆర్ చేంజ్ మేకర్స్' అన్నారు. ఉపాధ్యాయులు తమ ప్రతిభతో విద్యలో, విద్యార్థుల్లో మార్పులకు నాంది పలకాలన్నారు. సందర్భంగా 'టీచర్స్ చేంజ్ మేకర్స్' అనే పోస్టర్ విడుదల చేశారు. బోధనలో ఉపాధ్యాయులు సొంతంగా తయారు చేసిన టీఎల్ఎంలను ఉపయోగించాలన్నారు. నిజ జీవిత సన్నివేశాలు అనుసంధానిస్తూ, కృత్యాధార బోధన, అభ్యాసనం నిర్వహించాలని తెలిపారు. వర్క్ బుక్స్ ఉపయోగించి విద్యార్థులు రాసిన ప్రతీ వర్క్‌షీట్‌ను మూల్యాంకనం చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలలో ఇంగ్లిష్‌లో మాట్లాడేలా చూడాలన్నారు. రీడింగ్ కాంపెయిన్ సెప్టెంబర్ 8 వరకు ప్రతీరోజు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. విద్యార్థులను జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జరిగే అనేక పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలన్నారు. పాఠశాలలలో వివిధ పోటీలు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ప్రతీ రోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని వెల్లడించారు. తల్లిదండ్రుల సమావేశాలు ప్రతీనెల మూడో శనివారం నిర్వహిస్తూ, విద్యార్థుల ప్రగతి, పాఠశాల అభివృద్ధిలో వారిని భాగసాములను చేయాలని సూచించారు. మన ఊరు – మన బడి పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. ఇంజినీరింగ్ అధికారులు పనుల పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, వివిధ శాఖల ఈఈలు, ఏఈలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఇరువర్గాలపై కేసు నమోదు

భీమిని: కన్నెపల్లి మండలం మోతుకుపల్లి శివారులోని రెండెకరాల భూమి కేసులో ఇరు వర్గాలపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కన్నెపల్లి గ్రామానికి చెందిన కామెర శంకర్, గురుండ్ల రామకృష్ణ, భుజంగంపై సుల్తానాబాద్ గ్రామానికి చెందిన మైదంశెట్టి అంజయ్య, అతని భార్య భూమిని ఆక్రమించుకుంటున్నారని తెలిసిన కన్నెపల్లి గ్రామస్తులు వారి వద్దకు వెళ్లి అడగగా మాటమాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గృహహింస కేసులో భర్తకు ఏడాది జైలు

బెల్లంపల్లి: కట్టుకున్న భార్యను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేసిన భర్తకు జడ్జి జైలుశిక్ష విధించినట్లు బెల్లంపల్లి టూటౌన్ ఎస్సై ఎస్.రవికుమార్ తెలిపారు. బెల్లంపల్లి మున్సిపాలిటీలోని సుభాష్‌నగర్ బస్తీకి చెందిన షమీనా భర్త ఎండి ముస్తాఫాపాషా అదనపు వరకట్నం తీసుకు రావాలని వేధిస్తున్నాడని 2011లో టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ రవీందర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు కానిస్టేబుల్ ఎండి రహీమొద్దీన్ సాక్షులను ప్రవేశ పెట్టగా అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అజయ్‌కుమార్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో గురువారం బెల్లంపల్లి జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ముకేష్ నిందితునికి ఏడాది సాధారణ జైలు, రూ.3 వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పినట్లు ఎస్సై తెలిపారు.

గుడుంబా తరలిస్తున్న యువకుడు అరెస్టు



పోలీసుల అదుపులో నిందితుడు

బెల్లంపల్లి: గుడుంబా తరలిస్తున్న ఓ యువకుడిని గురువారం అరెస్టు చేసినట్లు తాళ్లగురిజాల ఎస్సై నరేష్ తెలిపారు. పెర్కపల్లి రోడ్డుపై పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన లంబాడితండాకు చెందిన ఇస్లావత్ రాజేష్ బైక్‌ను ఆపి తనిఖీ చేయగా ఆరు లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. వేరే వ్యక్తి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు నిందితుడు పేర్కొన్నాడు. నాటుసారాను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వదినను చంపుతానని బెదిరించిన మరిదికి జైలుశిక్ష

బెల్లంపల్లి: ఇంట్లోకి వెళ్లకుండా వదినను అడ్డగించి చంపుతానని బెదిరించిన కేసులో మరిదికి బెల్లంపల్లి జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గురువారం నెలరోజుల సాధారణ జైలుశిక్ష, రూ.2వేల జరిమానా విధించినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. పట్టణంలోని బజారు ఏరియాకు చెందిన హరికిషన్‌సార్డా కొంత కాలం క్రితం మృతి చెందాడు. ఆయన మరణాంతరం ఆస్తి కోసం హరికిషన్ సార్డా భార్య నిర్మల సార్డాను మరిది బాలకిషన్‌సార్డా వేధింపులకు గురి చేయడం మొదలు పెట్టాడు. దీనిపై బాధితురాలు 2016లో బాలకిషన్‌సార్డా పై వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై గంగరాజ గౌడ్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్‌దాఖలు చేశాడు.నేరం రుజువుకావడంతో జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్.ముకేష్ నిందితుడు బాలకిషన్ సార్డాకు నెల రోజుల సాధారణ జైలు, రూ.2వేల జరిమానా విధిస్తూ తీర్పుచెప్పారని ఎస్‌హెచ్‌ఓ శంకరయ్య తెలిపారు.

బ్యాంకు అధికారుల తీరుపై మహిళ నిరసన

ఆసిఫాబాద్: బంగారం బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్న రుణం తిరిగి చెల్లించినా తన బంగారం తనకు ఇవ్వడంలేదని మండలంలోని చిర్రకుంటకు చెందిన స్వయంసహాయక సంఘం మహిళ కామెర సునంద గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ఆవేదన వ్యక్తం చేసింది. ఉదయం నుండి సాయంత్రం వరకు అక్కడే ఉన్నా బ్యాంకు అధికారులు తనను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశారని వాపోయింది. రెండేళ్ల క్రితం నాలుగున్నర తులాల బంగారం బ్యాంకులో పెట్టి 1.20 లక్షలు తీసుకోగా వడ్డీతో సహా రూ.1.31 లక్షలు బుధవారం తన బ్యాంకు అకౌంట్ ద్వారా చెల్లించానని తెలిపింది. తన బంగారం తిరిగి ఇవ్వాలని రెండు రోజులుగా బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ రవికుమార్‌ను వివరణ కోరగా సదరు మహిళతో పాటు మరో ముగ్గురు మహిళలు జిల్లా కేంద్రంలో డోంగ్రే సూపర్‌మార్కెట్ నిర్వహిస్తూ రూ.4 లక్షలు రుణం తీసుకున్నారని, రెగ్యులర్‌గా ఈఎంఐ చెల్లించక పోవడంతో ఎన్‌పీఏ కింద నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. ఈ క్రమంలో సదరు మహిళ బంగారం తిరిగి ఇవ్వలేదన్నారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

శిల్పకళలో రాణిస్తున్న సీతారాం

- విగ్రహాల తయారీతో ఉపాధి
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపు





నంది విగ్రహం చెక్కుతున్న సీతారాం

ఇంద్రవెల్లి(ఖానాపూర్): మండలంలోని పిట్టబోంగరం గ్రామానికి చెందిన శిల్పకళాకారుడు వెట్టి సీతారాం అద్భుతమైన కళాఖండాలను తయారు చేస్తూ అందరిచేత ఔరా అనిపించుకుంటున్నాడు. అతను చదివింది అంతంత మాత్రమే అయినా శిల్పకళలో రాణిస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటున్నాడు. గ్రామంలో తనకున్న ఐదెకరాల వ్యవసాయ భూమిని సాగుచేస్తూనే పదిహేనేళ్లుగా విగ్రహాల తయారీతో ఉపాధి పొందుతున్నాడు. ఉమ్మడి జిల్లాలో ఆదరణ ఉన్న జై జంగో.. జై లింగో.. పద్మల్‌పురి కాకో వంటి విగ్రహాలు తయారు చేయడంతో పాటు అంజనేయుడు, వినాయకుడు, ఆదివాసీ ఉద్యమకారుడు కుమురంభీం, బుద్ధుడు, శివలింగం, నంది, అటవీ జంతువులైన నెమళ్ల విగ్రహాలు చెక్కుతున్నాడు.

సైజ్‌ను బట్టి ధర

శిల్పకళాకారుడు సీతారాంకు ఉమ్మడి జిల్లా నుండి విగ్రహాల తయారీకి ఆర్డర్లు బాగానే వస్తున్నాయి.



సీతారాం తయారు చేసిన నెమలి విగ్రహాలు

బండరాయి, సిమెంట్‌తో కూడిన హనుమాన, శివలింగం, నంది, నెమలి, జై జంగో...జై లింగో విగ్రహాలు చెక్కి విక్రయిస్తున్నాడు. విగ్రహం సైజ్‌ను బట్టి ధర ప్రకటిస్తున్నాడు. రూ.2 వేల నుంచి రూ.50 వేల వరకు విగ్రహాలను విక్రయిస్తున్నాడు.

12 సార్లు దరఖాస్తు చేశా



విగ్రహాలు చెక్కడానికి కావాల్సిన యంత్రాలు, పరికరాలు కొనుగోలు చేసేందుకు ఇప్పటి వరకు ఐటీడీఏతో పాటు కేస్లాపూర్ నాగోబా జాతరలో ఏర్పాటు చేస్తున్న నాగోబా దర్బార్‌లో 12 సార్లు దరఖాస్తు చేసుకున్నా. దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు ఎలాంటి సాయం అందించడం లేదు. ఐటీడీఏ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా కలెక్టర్ దృష్టి సారించి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

– వెట్టి సీతారాం, శిల్పకళాకారుడు, పిట్టబోంగరం

ఆర్థికసాయం కోసం ఎదురుచూపు

ఆదివాసీ నిరుపేద కుటుంబానికి చెందిన సీతారాం వ్యవసాయ చేస్తూనే తనకున్న కళతో విగ్రహాలు తయారు చేసి ఉపాధి పొందుతున్నాడు. కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం పొందలేదు. సంప్రదా య విగ్రహాల తయారీ కళపై ఆధారపడ్డ తనను విస్మరించి ఉన్నత స్థాయి కళాకారులకు మాత్ర మే ప్రభుత్వం చేయూతనిస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన కళను మరింత అభివృద్ధి పరిచేందుకు ఆర్థికసాయంకోసం ఐటీడీఏ చుట్టూ తిరిగినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోతున్నాడు. ఇప్పటికై నా ఏజెన్సీలో ఉన్న తమలాంటి కళాకారులను ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించాలని కోరుతున్నాడు.

కదిలి పాపహరేశ్వరాలయానికి శ్రావణ శోభ



శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయం

దిలావర్‌పూర్(నిర్మల్): జిల్లాలోనే అత్యంత ప్రాచీన ప్రాశస్త్యం గల శ్రీమాతాన్నపూర్ణేశ్వరి కదిలి పాపహరేశ్వరాలయంలో గురువారం నుండి శ్రావణమాస ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. ఆపరమ శివుని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. గలగలా పారే సేలయేరు..కొండల నడుమ ప్రాచీన శిల్పకళా దర్పణంగా నిలిచిన విగ్రహాలు, పశ్చిమదిశ ముఖద్వారం గల ఆలయం పచ్చని ప్రకృతి నడుమ ఆద్యంతం భక్తులను మంత్రముగ్ధుల్ని చేస్తోంది.

ప్రత్యేక ఏర్పాట్లు

శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించనున్న ప్రత్యేక పూజలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ చైర్మన్ నార్వాడి వెంకట్రావు పాటిల్, ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలతో పాటు మహిళలు కుంకుమ పూజలు నిర్వహించనున్నారు.

ప్రహరీ కూల్చివేత

నస్పూర్: పట్టణ పరిధిలోని 11 వవార్డు ఎఫ్‌సీఐ కాలనీలో రోడ్డుపై అక్రమంగా నిర్మించిన రెడిమేడ్ ప్రహరీని గురువారం మున్సిపల్ అధికారులు బ్లేడు ట్రాక్టర్‌తో కూల్చి వేయించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమేశ్ మాట్లాడుతూ పట్టణంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఎవరైనా అక్రమ నిర్మాణాలు, చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

వైద్యం వికటించి బాలుడు మృతి



ఆస్పత్రి ముందు గుమిగూడిన బంధువులు

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన
- ప్రైవేట్ ఆస్పత్రి ముందు ఉద్రిక్తత
- ఎట్టకేలకు సద్దుమణిగిన వివాదం
- కేసు నమోదు చేసిన పోలీసులు

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం వికటించి బాలుడు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..దహెగాం మండలం హేటిగూడ గ్రామానికి చెందిన ఎన్.ఓదెలు–శ్రీదేవి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఎన్.సాకేత్ (09) సంతానం. కుమారుడు దహెగాం మండలం లగ్గాంలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి సాకేత్‌కు జ్వరం రావడంతో తండ్రి గురువారం తన ద్విచక్ర వాహనంపై కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు యాంటీబయాటిక్ ఇంజక్షన్ ఇవ్వాలని సూచించడంతో ఏఎన్‌ఎం బాలుడికి ఇంజక్షన్ ఇచ్చే క్రమంలో వాంతి చేసుకుని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బంధువులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎందుట ఆందోళనకు దిగారు. వైద్యుడి నిర్లక్ష్యం కారణంగానే తన కుమారుడు మృత్యువాత పడ్డాడని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ సీఐ బుద్దేస్వామి, దహెగాం ఎస్సై సనత్‌రెడ్డి, పట్టణ ఎస్సైలు కల్యాణ్, అంజయ్య సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వైద్యున్ని సంప్రదించగా బాలుడి శరీరంలోని షుగర్ లెవల్ తగ్గిపోవడంతోనే మృతి చెందినట్లు వివరించాడు. పోలీసుల హామీతో ఆందోళన విరమించడంతో మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తుప్రారంభించినట్లు సీఐ బుద్దే స్వామి వివరించారు.



సాకేత్ (ఫైల్)

కూరగాయల సాగును పరిశీలించిన కలెక్టర్



చందారంలో కూరగాయల సాగును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి

మామడ:మండలంలోని న్యూసాంగ్వి గ్రామానికి చెందిన రైతులు కోండ్ర శివారెడ్డి, రాంచందర్‌రెడ్డికి చెందిన కూరగాయల తోటలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఉపాధిహామీ ద్వారా మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకుని పంటచేనులో సోరకాయలు, దొండ సాగు చేస్తున్న రైతులను అభినందించారు. కూరగాయల సాగుతో వస్తున్న లాభాల గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ సాగుతోపాటు కూరగాయల సాగుపై దృష్టి పెడితే ప్రత్యామ్నాయ ఆదాయం పొందవచ్చని తెలిపారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఏడీ వినయ్‌బాబు, ఎంపీడీవో రమేష్, ఏఈవోలు సృజిత, శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

మామడలోని సంతోష్‌నగర్ కాలనీ, ఎస్సీ కాలనీలలోని అంగన్‌వాడీ కేంద్రాలను కలెక్టర్ వరుణ్‌రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విద్యార్థుల సంఖ్య, వారికి అందించే సరుకుల వివరాలు తెలుసుకున్నారు. కేంద్రంలో విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు పెంచాలని ఆదేశించారు.

బాసర వరకు తిరుపతి రైలు..!

- సూపర్ ఫాస్ట్ పొడిగింపునకు ప్రతిపాదన

భైంసా(ముధోల్): ప్రస్తుతం తిరుపతి నుండి కరీంనగర్ వరకు నడుస్తున్న బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును నిర్మల్ జిల్లా బాసర వరకు పొడిగించాలని దక్షిణ మధ్య రైల్వే జోన్ అధికారులు రైల్వే బోర్డుకు ప్రతిపాదనలు పంపించారు. రైల్వే బోర్డు కూడా ఇందుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు సమాచారం. 1271/62 బై వీక్లీ సూపర్ ఫాస్ట్ రైలు ప్రస్తుతం తిరుపతి నుండి కరీంనగర్ వరకు నడుస్తోంది. తిరుపతి నుండి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలును బాసర వరకు పొడిగిస్తే అటు తిరుమల వెంకటేశ్వర స్వామి క్షేత్రాన్ని ఇటు బాసర సరస్వతి అమ్మవారి క్షేత్రముతో అనుసంధానం చేసినట్లు అవుతుంది. పైగా బాసర నుండి తిరుపతి వయా పెద్దపల్లి–నిజామాబాద్–కాజీపేట టౌన్–విజయవాడ దగ్గరి మార్గం. ప్రస్తుతం నడుస్తున్న కృష్ణాఎక్స్ ప్రెస్‌తో పోలిస్తే ఈ మార్గం కొంచెం దగ్గరగా అవుతుంది.



బాసర రైల్వే స్టేషన్

ఉమ్మడి జిల్లాకు సౌకర్యంగా..

ఉమ్మడి ఆదిలాబాద్‌లోని సిర్పూర్ కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ రోడ్డు, బెల్లంపల్లి, మందమర్రి, రవీంద్రఖని, మంచిర్యాల ప్రయాణికులు ఉదయం సికింద్రాబాద్ వెళ్లే ప్రయాణికులు, భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు వచ్చే యాత్రికులు పెద్దపల్లి జంక్షన్‌లో దిగి 12761 రైలులో కరీంనగర్ నుండి బాసరకు వెళ్ళే అవకాశం ఉంటుంది.

సరస్వతీ ఎక్స్‌ప్రెస్‌గా...

తిరుపతి నుండి కరీంనగర్ బై వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును బాసర వరకు పొడిగించిన తరువాత అదనంగా 3 రోజులు పెంచాలి. ఈ రైలు పేరును 'సరస్వతి' ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేయాలన్న ప్రతిపాదన ఉంది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఈ రైలు పొడిగింపు విషయంలో రైల్వే మంత్రి అశ్వినివైష్ణవ్, సహాయమంత్రి రావుసాహెబ్ దన్వే పాటిల్‌ను కలిస్తే ఈ ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం లభించే అవకాశం ఉందని రైల్వేవర్గాలు పేర్కొంటున్నాయి.

25న గోండుగూడకు రానున్న ట్రెయినీ కలెక్టర్లు

- ఏర్పాట్లు పరిశీలించిన పీడీ విజయలక్ష్మి

దస్తురాబాద్(ఖానాపూర్): ఆదివాసీల జీవన విధానం, వారి సంక్షేమానికి ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలు క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ట్రెయినీ కలెక్టర్లు మండలంలోని గోండుగూడకు రానున్నట్లు డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి తెలిపారు. వారు బస చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లను గురువారం పీడీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 25న ఆరుగురు సభ్యులతో కూడిన ట్రెయినీ కలెక్టర్ల బృందం గ్రామంలో పర్యటిస్తారని, ఆదివాసీల సమస్యలు తెలుసుకుని వారి అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై కలెక్టర్, జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తారని ఆమె పేర్కొన్నారు. పీడీ వెంట ఏపీడీ ప్రసాద్, సర్పంచ్ సిడాం లక్ష్మి, ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీవో అనిల్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.



గోండుగూడలో పర్యటిస్తున్న పీడీ విజయలక్ష్మి

రెండో ఏఎన్‌ఎంలకు 'ఈటల' మద్దతు

నిర్మల్: ప్రజలకు తమ సేవలను అందిస్తున్న రెండో ఏఎన్‌ఎంల సమస్యలు, డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేస్తున్న రెండో ఏఎన్‌ఎంలకు తన మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, రమాదేవి, రామారావ్ పటేల్, డా.మల్లికార్జున్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, చిట్యాల సుహాసినిరెడ్డి, హరినాయక్, జానుబాయి, తదితరులు పాల్గొన్నారు.



మద్దతు ప్రకటిస్తున్న రాజేందర్

నేడు స్వదేశానికి చేరనున్న మృతదేహం



రమేష్(ఫైల్)

సారంగపూర్(నిర్మల్): మండలంలోని కౌట్ల(బి) గ్రామానికి చెందిన బెజ్జారం రమేశ్ (34) ఈ నెల 5న దుబాయ్‌లో బీచ్‌వద్ద ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశామని ప్రవాసి మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిండ్ల గురువారం మీడియాకు వెల్లడించారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక ఆంబులెన్స్ ద్వారా మృతదేహాన్ని కౌట్ల(బి) గ్రామానికి రప్పించడానికి తెలంగాణ రాష్ట్ర జనరల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఈడిగె చిట్టిబాబు ద్వారా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

గుండెపోటుతో రేషన్ డీలర్ మృతి

బేల: మండల కేంద్రంలోని చౌకధరల దుకాణం నం.2కు చెందిన రేషన్ డీలర్ కాంబ్లే వికాస్ (26) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానిక అంబేద్కర్ కాలనీకి చెందిన వికాస్ రోజువారీలా వాకింగ్ వెళ్లి ఇంటికి తిరిగి వచ్చి స్నానం చేసే క్రమంలో అకస్మాత్తుగా వాంతులు చేసుకుని స్పృహ కోల్పోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు



గాయాలపాలైన కొడప పవన్

గుడిహత్నూర్(బోథ్): మండలంలోని పూనగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు కాగా ఒకరి పరిస్థితి ఆందోళన కరంగా ఉన్నట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్‌నగర్‌కు చెందిన గెడం మారుతి చింతగూడకు చెందిన ఓ ట్రాక్టర్ యజమాని వద్ద కూలీ పని చేస్తున్నాడు. తన స్నేహితుడు ఇచ్చోడ మండలం తలమద్రికి చెందిన కొడప పవన్‌తో కలిసి గురువారం తన అత్తగారి ఊరైన ఇంద్రవెల్లి మండలంలోని మెండపల్లికి బైక్‌పై బయలు దేరారు. తోషం సమీపంలో నిలిచి ఉన్న బొలెరో వాహనాన్ని వెనుక నుండి ఢీకొట్టారు. ఘటనలో పవన్‌కు తీవ్రంగా మారుతికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్య



డిగంబర్(ఫైల్)

గుడిహత్నూర్(బోథ్): పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ఇమ్రాన్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన నాగర్‌గోజే డిగంబర్ (43) తనకున్న నాలుగెకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల తన సోదరుడు దత్తా వద్ద నుంచి ఎకరా పొలాన్ని రూ.10లక్షలు వెచ్చించి కొనుగోలు చేశాడు. అతనికి ఇవ్వాల్సిన డబ్బులు సకాలంలో అందకపోవడంతో మానసిక ఒత్తిడికి గురయ్యాడు. బుధవారం రాత్రి మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఇంటికివచ్చి కుటుంబ సభ్యులతో చెప్పాడు. వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య అయోధ్యాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడు...



స్వామి (ఫైల్)

తలమడుగు(బోథ్): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆర్లీ (కే) గ్రామానికి చెందిన దాసరి స్వామి (26)కి బుధవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో కడుపునొప్పి రావడంతో బాధ భరించలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం తెల్లవారుజామున కుటుంబ సభ్యులు చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై ధనశ్రీ తెలిపారు.